క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బోనకల్: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. బోనకల్ ఎస్సీ కాలనీలో సింగిల్‌ఫేస్ కరెంట్‌లో అంతరాయం ఏర్పడడం వల్ల గృహోపకరణాల కాలిపోతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంతోటి వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, మోర్ల నరసింహారావు, తోటకూర స్వామి, ఏసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య ఆలయ అక్షింతలు పంపిణీ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శ్రీ కోదండరామస్వామి ఆలయంలో పూజలు చేసిన అక్షింతలను శుక్రవారం రాత్రి ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవుని ఊరేగింపు నిర్వహించారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ అక్షింతలను ఈ నెల 22న అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్ఠ, కల్యాన కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి తీసుకెళ్లాలని అర్చకులు తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఎర్రుపాలెం: మండల పరిధిలోని గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కావున 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల వనభోజనాలు

సత్తుపల్లిటౌన్: ఆటపాటలతో సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు శుక్రవారం ఉత్సాహంగా గడిపారు. డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులకు వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, లెమన్ స్పూన్, రన్నింగ్, కుర్చీలాటా, అంత్యాక్షరి తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 10 కుటుంబాలు శుక్రవారం కాంగ్రెస్‌లోకి చేరాయి. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము అంజయ్య, తిరుపతి గోవిందరావు, గాదె రామారావు, తూము కోటేశ్వరరావు, తిరుపతి యాదయ్య, కొర్లపాటి అంజి, కన్నెబోయిన సీతారామయ్య, పిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కొణిజర్ల: కొణిజర్ల సమత సూపర్‌జెమ్స్ పాఠశాలలో శుక్రవారం ఫైర్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైరా ఫైర్ ఆఫీసర్ మాధవరావు.. ప్రమాదాలు జరిగిన వెంటనే ఎలా స్పందించాలో వివరించారు. ఇంట్లో గ్యాస్ సిలెండర్లు పేలినప్పుడు, చెరువుల్లో, బావుల్లో పడి పోయినప్పుడు నీటిలో మునిగిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కొణతం ఉమాశంకరరావు, ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: ముదిగొండ ఉపకేంద్రం పరిధిలోని వినియోగదారులకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌లైన్ల మరమ్మతులు, చెట్లు తొలగింపు పనులు ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ముదిగొండ విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మూతబడి..!

విద్యార్థులు లేక అష్ణగుర్తి హైస్కూల్‌కు తాళాలు

- దూరమవుతున్న ప్రాథమిక విద్య
- ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల ఆగ్రహం
- కిక్కిరిసిపోతున్న ప్రైవేట్ హైస్కూళ్లు



మూసివేసిన అష్ణగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

వైరారూరల్: ఒకనాడు ఎక్కడో దూరం దూరంగా ఉండే పాఠశాలల్లో పాతతరం నాయకులు, ప్రజలు ఎవరితరం చూసిన పాఠశాలలకు పదులకొద్ది కిలోమీటర్లు నడిచి వెళ్లిన చరిత్ర ఉండేది. అప్పట్లో పెద్దగా పాఠశాలలు ఉండేవి కావు.. రెండు గ్రామాలకు, మండలానికో అన్నట్లుగా ఉండేవి.. దీంతో చాలా మంది విద్యకు దూరంగా ఉండేవారు. అక్షరస్యత శాతం తక్కువగా ఉండేది. రాను రాను చదువు చెంతకొచ్చి.. అక్షరాస్యత శాతం పెరిగింది. కానీ ప్రస్తుతం మళ్లీ ఆ పాత కాలమే కళ్లెదుట కనిపిస్తుంది.. పక్క ఊరికి వెళ్లి చదువుకోవాల్సిన ఆగత్యం ఏర్పడింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మూతబడిన హైస్కూల్..

మండలంలోని అష్ణగుర్తి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం లేకపోవడంతో పాఠశాలను మూసివేసి తాళాలు వేశారు. 1980–81 ప్రాంతంలో ఈ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. అప్పటి నుంచి గత మూడేళ్ల క్రితం వరకు కూడా వేలాది మంది విద్యార్థులు ఇక్కడ 10వ తరగతి వరకు విద్యనభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. అలాంటి పాఠశాలకు ఇప్పుడు విద్యార్థుల హాజరు లేక మూత వేయాల్సిన పరిస్థితి దాపురించింది.

తొమ్మిదిమందే విద్యార్థులు..

ఈ ఏడాది ఇక్కడి హైస్కూల్‌లో కేవలం 9 మంది విద్యార్థులు మాత్రమే ఉండడంతో వారిలో ఏడుగురిని మూడు కిలో మీటర్ల దూరంలోని గొల్లపూడి జెడ్పీహెచ్ఎస్‌కు, మరో ఇద్దరిని ఇంగ్లీషు మీడియం కోసం రెబ్బవరం హైస్కూల్‌కు పంపించారు. దాంతో పాఠశాల విద్యార్థుల హాజరు శాతం పూర్తిగా కోల్పోవడంతో పాఠశాలకు తాళాలు వేసి కొద్దిరోజుల కిందట మూసేశారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు, జూనియర్ అసిస్టెంట్, పీఈటీలను తుమ్మలపల్లి హైస్కూల్‌కు అలాగే ఫిజిక్స్ ఉపాధ్యాయుడిని గన్నవరం, హిందీ ఉపాధ్యాయుడిని రెబ్బవరం జెడ్పీహెచ్ఎస్‌లకు డిప్యుటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో విచ్చలవిడిగా పశువులు సంచరిస్తూ పాఠశాల ఆవరణలోని పలు రకాల మొక్కలను మేస్తున్నాయి.

ఆదరణ ఉన్న.. అవగాహన లోపంతో..

ఈ పాఠశాలలో హాజరుశాతం తగ్గడానికి అవగాహన లోపం కారణమని పలువురు విమర్శిస్తున్నారు. గత మూడేళ్లనుంచి విద్యార్థుల హాజరుశాతం తగ్గుతున్నా.. విదార్థులను సమీకరించి, హాజరుశాతం పెంచేలా కృషి చేయడంలో ఉపాధ్యాయ బృందాలు పూర్తిగా వైఫల్యం చెందాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పలువురు తల్లిదండ్రులు ప్రైవేట్ వైపు మక్కువ చూపుతున్నారు. ఏదేమైనా పాలకులు, ఉపాధ్యాయ బృందాలు అవగాహన లోపంతో గత 43 ఏళ్ల పాఠశాల చరిత్ర కలిగిన హైస్కూల్‌ను మూసివేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

నమ్మకం లేకనే..

- ప్రభుత్వం సర్కారు బడుల్లో విద్యార్థులకు ఉచిత విద్య అందించడంతోపాటు సకల సౌకర్యాలు కల్పిస్తున్నా.. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల విద్యాబోధన మీద నమ్మకం లేకపోవడంతో విద్యారంగం ప్రైవేటీకరణ అవుతుంది. రూ.లక్షలు వెచ్చించి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్న నేపథ్యాన సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరుశాతం లేక ప్రభుత్వ పాఠశాలలు మూసివేయాల్సిన దుస్థితి నెలకొంది.
- గత ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టి ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తామని తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన వారు సర్కారు బడుల వైపు మొగ్గు చూపకపోవడం లేదు. అంతే కాకుండా విద్యార్థులు సైతం సాంఘీక సంక్షేమ పాఠశాలలో సీట్లు సాధించేందుకు ఆసక్తి కనబర్చడం తదితర కారణాల వలన సర్కారు బడులు మూసివేతకు కారణమవుతున్నాయి.

పాఠశాలను పునఃప్రారంభించాలి..



సర్కారు బడుల్లో విద్యార్థులకు కల్పించే సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. అంతేకాకుండా అష్ణగుర్తి, గొల్లెనపాడు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అష్ణగుర్తి హైస్కూల్‌కు రప్పించి పాఠశాలను పునఃప్రారంభించాలి.

– ఇటుకల మురళి, గ్రామ సర్పంచ్

బాధాకరం..



43 ఏళ్ల చరిత్ర కలిగిన అష్ణగుర్తి హైస్కూల్‌ను విద్యార్థుల హాజరుశాతం లేకపోవడంతో తాళాలు వేసి మూసివేయడం బాధాకరం. నా లాంటి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ 10వ తరగతి వరకు చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. అలాంటి ఈ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– షేక్.సైదాబాబు, పూర్వ విద్యార్థి

పక్షపాతం లేకుండా పథకాలు అందిస్తాం..



పెనుబల్లి: బయ్యన్నగూడెంలో.. దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి/వేంసూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు పథకాలను అమలు చేసిందని, అభయ హస్తం పథకాలను పక్షపాతం లేకుండా అందిస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మున్సిపాల్టీలోని 19వ వార్డు, రేజర్ల పంచాయతీలలో, పెనుబల్లిలోని గంగదేవిపాడులో, బయ్యన్నగూడెం గ్రామాల్లో, వేంసూరు, మర్లపాడులో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామన్నారు. అనంతరం రూ.46 లక్షల సింగరేణి నిధులతో రేజర్ల గ్రామంలోని హరిజనవాడలో అంతర్గత రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెనుబల్లిలోని గంగాదేవిపాడు గ్రామంలోని పోడు భూముల సమస్య, బ్రిడ్జి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమాలల్లో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, కౌన్సిలర్ మందపాటి పద్మజ్యోతి, రేజర్ల సర్పంచ్ ప్రభాకర్, ఉపసర్పంచ్ భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నారాయణవరపు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, గ్రామ నాయకులు మాలోతు జగన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, చీకటి రామారావు, చిన్నస్వామి, గూడూరు మాధవరెడ్డి, దొంతు, మాధవరావు, వంగా దామోదర్, తహసీల్దార్ ఎంపీ రాజు, ఎంపీఓ రంజిత్ కుమార్, నాయకులు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, ఎండీ ఫైజుద్దీన్, జగన్‌మోహన్‌రావు, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

వేంసూరు: మండలంలోని భీరవల్లి పంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో పడుతున్న అవస్థలపై భీరవల్లి వాసులు ఎమ్మెల్యేకి తెలుపగా.. స్పందించిన ఆమె సంబంధిత శాఖ అధికారులైన ఎంపీడీఓకు గ్రామాల్లో వస్తున్న ఫిర్యాదులను వివరించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో నిర్లక్ష్య వైకరి ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో అందుబాటులో లేకుండా ఉండే కార్యదర్శులు సక్రమంగా విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తు స్వీకరణలో ఏ ఒక్కరికీ నష్టం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చివరి నిముషం వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

‘ప్రజాపాలన’ను సద్వినియోగం చేసుకోండి



చింతకాని: నాగులవంచ గ్రామసభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

బోనకల్/చింతకాని: ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం బోనకల్ మండలంలోని ముష్టికుంట్లలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ప్రజల దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. నియోజకవర్గంలో 70 వేలు, మండలంలో 14 వేల దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి స్వీకరించడం జరిగిందన్నారు. 3వ రైల్వేలైన్‌కు సంబంధించి తమ భూములకు పరిహారం అందలేదని ముష్టికుంట్ల రైతులు షేక్ జానీమియా, ఖాసీం తదితరులు ఆర్డీఓ గణేష్‌కు తెలపగా రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి.. త్వరలోనే అకౌంట్లలో డబ్బులు జమవుతాయని తెలిపారు. అదే విధంగా చింతకానిలోని నాగులవంచ, రామకృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో లబ్ధిదారుల దరఖాస్తులను ఆయన పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణకు మరోరోజు గడువు ఉండడంతో మిగిలిన లబ్ధిదారులందరు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ప్రత్యేక అధికారి వెంగలాంబ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీనివాసరావు ఎంపీటీసీ మహేశ్వరి, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు,ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, గ్రామసర్పంచ్‌లు నాగమణి, కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యులు నాగరత్నం, సరోజిని, కొరివీరమ్మ, ప్రజాపాలన మండల ప్రత్యేకాధికారి సతీష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి నాగయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, ఐకేపీ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా డేటా ఎంట్రీ చేపట్టండి



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి

సత్తుపల్లిటౌన్: అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి డేటా ఎంట్రీ నమోదు ప్రక్రియను జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వార్డు సభల్లో వచ్చిన ప్రతి అభయహస్తం దరఖాస్తుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ.. ఏ మాత్రం తప్పులు దొర్లకుండా నిర్వహించాలని ఆదేశించారు. డేటా ఎంట్రీలో సబ్‌మిట్ కాగానే దరఖాస్తు దారుని ఫోన్‌కు సమాచారం వెళ్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఏఈ సురేష్, మేనేజర్ శ్రీనివాసరావు, ఏఓ స్వప్న, డీటీ శివ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు



వైరాలోని సీసీ కెమెరాలు

సాక్షి ఎఫెక్ట్..

వైరా: ఈ నెల 3న వైరాలో నిఘా ఉన్నా లేనట్టే అనే కథనాన్ని సాక్షి ప్రచురించగా స్పందించిన పోలీస్ అధికారులు మధిర రోడ్డు, క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వైరాలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు, చోరీలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు ఇబ్బందిగా ఉండటం, బస్టాండ్‌లో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని ప్రచురించగా.. ఎట్టకేలకు అధికారులు స్పందించి కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి తుమ్మలకు వినతి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న అంజనాపురం రైతులు

కొణిజర్ల: తమ జీవనాధారమైన సాగు భూమిని ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం చేయడానికి అధికారులు కుట్ర చేస్తున్నారని దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మండలంలోని గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని రైతులు శుక్రవారం ఖమ్మంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పట్టుపరిశ్రమల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. వివరాల ప్రకారం.. అంజనాపురం గ్రామానికి చెందిన పొన్నం మోహన్‌రావు, లక్ష్మయ్య, చల్లగుండ్ల కవిత, యారగాని వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నరసింహారావు, కృష్ణారావు, భద్రమ్మ, నాగమణి, కృష్ణకుమారి తదితర రైతులకు అంజనాపురం సర్వే నంబర్ 111లో పట్టా భూములున్నాయి. గత ఏడాది సదరు గ్రామంలో ఓ ప్రైవేట్ కంపెనీ వారు పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన మేరకు అధికారులు భూసేకరణ చేపట్టారు. ఆ సమయంలో తమ పట్టా భూములు ఇవ్వబోమని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఇటీవల మళ్లీ అధికారులు గత ఏడాది డిసెంబర్ 28 రెండో దఫా భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడటానికి పోతే తమ పట్ల దురుసుగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి తమ భూములు లాక్కోకుండా తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ



వైరా: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సదస్సులు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో లబ్ధిదారులు అందించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజాపాలన నిరంతర ప్రక్రియ అని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. గ్రామ సభల అనంతరం దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి



మధిర: దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ మల్లాది సవిత



కారేపల్లి: మాధారం గ్రామంలో..



కల్లూరు: అంబేద్కర్‌నగర్‌లో..

నాటుసారా తయారీదారులపై కేసు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని బత్తులపల్లి, కొత్తబోడిమెల్ల, హనుమ తండాల్లో ఎక్సైజ్ ఎస్సై ఎం.వెంకటేశ్ ఆధ్వర్యాన శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నాటుసారా తయారుచేస్తున్న భద్రు, సేలి, ప్రియాంక, చిన్న, ఆచి, రమణిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని కల్లూరు తహసీల్దార్ పులి సాంబవుడు ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఉద్యోగులు నాగరాజు, విల్సన్, విజయ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరణ

సత్తుపల్లి: నూతన సంవత్సర క్యాలెండర్లను సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య, దొడ్డా శంకర్‌రావు, యాగంగి శ్రీనివాసరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, అజార్, వీరపనేని బాబీ, అంకమరాజు, మాధురి మధు, శ్రీను, వల్లభనేని పవన్, అద్దంకి అనీల్, రఘు, మోరంపూడి ప్రభాకర్, ప్రసాద్, పర్వతనేని వేణు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సంఘం..

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ క్యాలెండర్లను ఆ పాఠశాల హెచ్ఎం బి.మురళీమోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూటీఎఫ్ క్యాలెండర్లు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కమిటీ అధ్యక్షుడు బండారు నాగరాజు, నాయకులు నీలం అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, రాజారావు, బేగం, టి.రత్తమ్మ, జి.శ్రీనివాస్, ఎం.నాగేశ్వరరావు, డి.మహేంద్ర కుమార్, బి.రమేష్ బాబు, పి.రాజేష్, టి.వెంకటకృష్ణారావు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి




ఎంఈఓ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న కార్మికులు

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన భారం మోయలేక కార్మికులు సతమతమవుతున్నారు. సత్తుపల్లి పట్టణ, మండల పరిధిలోని మధ్యాహ్న భోజన కార్మికులకు కొడిగుడ్లు భారంగా మారాయని.. వాటిని శుక్రవారం నుంచి విద్యార్థులకు అందించలేమని ఎంఈఓ బి.రాములుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ.. మార్కెట్లో కొడిగుడ్డు ధర రూ.7లు ఉందని.. కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.4, రూ.5ల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో ప్రతి విద్యార్థిపై రూ.3లు భారం వెచ్చించాల్సి వస్తుందన్నారు. అదే విధంగా ప్రభుత్వం వంటగ్యాస్, కట్టెలకు గానీ.. బిల్లు చెల్లించలేదన్నారు. ప్రతి విద్యార్థిపై రెండురూపాయలు పెంచాలన్నారు. అలాగే గత ఐదు నెలలుగా రావాల్సిన బకాయిలను తక్షణమే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి తెలగారపు రామారావు, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకురాలు కె.లక్ష్మి, నిమ్మటూరి కృష్ణవేని, తెలగారపు కనకదుర్గ, కృష్ణమ్మ, షేక్ సుబేదా పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్

సత్తుపల్లిటౌన్: బస్సులో పోగుట్టుకున్న ఫోన్‌ను మర్చిపోయిన ప్రయాణికుడికి అందించి సత్తుపల్లి ఆర్టీసీ కానిస్టేబుల్ కె.నరేష్ తన నిజాయితీ చాటుకున్నాడు. వివారాల ప్రకారం.. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన పి.కవిత గురువారం రాజదాని బస్సులో హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి చేరుకుంది. ఈ క్రమంలో పోగొట్టుకున్న తన మొబైల్‌ను కానిస్టేబుల్ నరేష్ గమనించి తీసుకున్నాడు. బాధితురాలు ఫోన్ చేయగా.. నరేష్ స్పందించి ఫోన్ తనవద్దనే ఉందని చెప్పగా.. శుక్రవారం సత్తుపల్లి డిపో ఏడీసీలు పివి రావు, జి.బాలస్వామి సమక్షంలో అప్పగించారు.

ఫ్లవర్స్ యూనియన్ ఎన్నిక



మోరు శ్రీకాంత్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నూతనంగా అంబేడ్కర్ ఫ్లవర్స్ యూనియన్ ఏర్పాటు చేశారు. సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోరు శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్‌గా రాయి రవి, సెక్రటరీగా షేక్ మక్బూద్, జాయింట్ సెక్రటరీగా మోరు సామేలు, గౌరవ సలహదారుడిగా చింతపల్లి జయరాజు, కోశాధికారిగా చింతపల్లి గోపాలరావు, ఆర్గనైజర్‌గా తడికమళ్ల రాంబాబులను ఎన్నుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు తల్లపురెడ్డి వెంకట్రావమ్మ(91) శుక్రవారం మృతి చెందింది. ఈమె మృతదేహాన్ని డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కూరపాటి సుందరమ్మ, ఎంపీటీసీలు యశోద, సామేలు, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి సందర్శించి నివాళి అర్పించారు.